క్లుప్తంగా

హెచ్ఎంకు గౌతమీ స్వర్ణ నంది పురస్కారం



అవార్డు అందుకుంటున్న బోనాల రవీందర్

మంథని: ఎక్లాస్‌పూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బోనాల రవీందర్ విద్యారంగంలో విశిష్ట సేవలందించినందుకుగాను గౌతమీ స్వర్ణ నంది పురస్కారం అందుకున్నారు.

రాష్ట్ర లీగల్ సెల్ అడ్వైజరీ కమిటీ ఇన్‌చార్జిగా వరలక్ష్మి

గోదావరిఖనిటౌన్: వినియోగదారుల హక్కుల సంస్థ(ఇండియా) తెలంగాణ రాష్ట్ర లీగల్ సెల్ అడ్వైజరీ కమిటీ ఇన్‌చార్జిగా గోదావరిఖనికి చెందిన న్యాయవాది ఎం.వరలక్ష్మిని నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు ప్రకాశ్ కుంట ఒక ప్రకటనలో తెలిపారు.

ఆలయంలో హుండీ చోరీ

పెద్దపల్లిరూరల్: పెద్దకల్వలలోని శ్రీమల్లికార్జునస్వామి ఆలయంలో హుండీని గుర్తుతెలియని వ్యక్తులు పగలకొట్టి సొమ్ము ఎత్తుకెళ్లారు. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు గౌడ సంఘ నాయకులు తెలిపారు.

సాగునీటి కాలువ పరిశీలన

పాలకుర్తి: మండల పరిధిలోని జయ్యారం, గుడిపల్లి, పుట్నూర్ గ్రామాల రైతులకు సాగునీరందించే కాలువలను సోమవారం ఇరిగేషన్ అధికారులు పరిశీలించారు. ఎస్సారెస్పీ డీ–83 ప్రధాన కాలువ ఉప కాలువ అయిన 17ఎల్ ద్వారా రైతులకు సాగునీరు సరఫరా అవుతోంది. అయితే ప్రస్తుతం సాగునీరందక పంటలు ఎండిపోతున్న నేపథ్యంలో రైతుల విన్నపం మేరకు డీఈ రాజ్యలక్ష్మి, ఏఈఈ శివకుమార్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రమేశ్ సంబధిత కాలువలను పరిశీలించారు. అయితే టేలాండ్ వరకు నీరు అందకుండా కొంతమంది వ్యక్తిగతంగా నిర్మించుకున్న చేపల చెరువుకు ఎస్సారెస్పీ నీటిని మళ్లిస్తున్నారని స్థానిక రైతులు అధికారులకు విన్నవించారు. సంబంధిత విషయమై రాతపూర్వకంగా ఫిర్యాదు చేయాలని అధికారులు సూచించారని రైతులు తెలిపారు.

యువతను మోసం చేస్తున్న తెలంగాణ ప్రభుత్వం

గోదావరిఖనిటౌన్: తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో నిరుద్యోగ యువత కోసం యూత్ డిక్లరేషన్‌ను అమలు చేస్తామని చెప్పి సంవత్సరం గడుస్తున్నా ఇచ్చిన హామీని అమలు చేయలేకపోవడం దురదృష్టకరమని టీఆర్ఎస్(డీ) పార్టీ యూత్ రాష్ట్ర సెక్రటరీ జనరల్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా విద్యార్థి విభాగం ఇన్‌చార్జి ఈదునూరి నర్సింగ్ ప్రకటనలో తెలిపారు.

పన్ను వసూళ్ల లక్ష్యం సాధించాలి

జూలపల్లి: ఎల్ఆర్ఎస్, ఇంటి పన్ను వసూళ్లు, పారిశుధ్యం, తాగునీటి సరఫరా లక్ష్యం సాధించాలని మండల పంచాయతీ అధికారి అనిల్‌రెడ్డి సూచించారు. ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కార్యదర్శులు ప్రవీణ్, రేవతి, సాగర్‌రావు తదితరులున్నారు.

ఈద్గా పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలి



సుల్తానాబాద్‌లో ఈద్గాను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

సుల్తానాబాద్: ఈద్గా పరిసరాల్లో పరిశుభ్రంగా ఉండేలా మున్సిపల్ కార్మికులు శుభ్రం చేయాలని మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ నియాజ్ అన్నారు. సోమవారం సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలో ఉన్న ఈద్గాలను సందర్శించారు.

ప్రజాపాలన కాదు.. దగాకోరు పాలన

కమాన్‌పూర్: రాష్ట్రంలో నడుస్తోంది కాంగ్రెస్ పార్టీ ప్రజాపాలన కాదని, దగాకోరు పాలనని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తాటికొండ శంకర్, బొమ్మగాని అనిల్, పొన్నం రాజేశ్వరి, సాయికుమార్, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు మజ్జిగ పంపిణీ

జూలపల్లి: పెద్దాపూర్‌లో పంట పొలాలకు మొరం పోస్తున్న ఉపాధిహామీ కూలీలకు గ్రామ బీఆర్ఎస్ నాయకులు మజ్జిగ అందజేశారు. ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు సంకెన్ల లక్ష్మణ్ మాట్లాడారు. తొగరు శ్రీనివాస్, కల్లెపెల్లి అంజయ్య, ఉయ్యాల వెంకటేశ్, ఆరకోలు శంకర్ తదితరులున్నారు.

వేలం పాట వాయిదా

ఓదెల: పెద్దకొమిర గ్రామంలో పొత్కపల్లి సొసైటీలో భూమిపై తీసుకున్న అప్పును తిరిగి చెల్లించనందుకుగాను రైతు భూమిపై జరిగే వేలం పాట సోమవారం వాయిదా పడింది.



గోటితో వడ్ల గింజలు ఒలుస్తున్న భక్తులు

సీతారాముల కల్యాణానికి కోటి తలంబ్రాలు

రామగుండం: పట్టణంలోని శ్రీభక్తాంజనేయస్వామి దేవాలయంలో ప్రతీ ఏటా వైభవంగా నిర్వహించే శ్రీసీతారాముల కల్యాణోత్సవ వేడుకల్లో(శ్రీరామనవమి) భాగంగా కల్యాణంలో వినియోగించే తలంబ్రాలను వరి ధాన్యాన్ని గోటితో ఒలిచి కోటి అక్షింతలను అందించాలని నిర్ణయించారు. సోమవారం శ్రీసీతారాముల దేవాలయ ప్రాంగణంలో ఆలయ పూజారి కమ్మల చంద్రశేఖరశర్మ ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మహిళా భక్తులు తలంబ్రాలను ఒలిచే పనిని ప్రారంభించారు.



వరి ధాన్యంతో జైశ్రీరాం

సెర్ప్‌లో మెప్మా విలీనం

- హర్షం వ్యక్తం చేస్తున్న మహిళా స్వశక్తి సంఘాలు

సుల్తానాబాద్: సెర్ప్‌లో మెప్మా విలీనం చేస్తామని మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అర్బన్ ప్రాంతాలైన సుల్తానాబాద్, పెద్దపల్లి, మంథని, గోదావరిఖనిల్లో మెప్మా సిబ్బంది పని చేస్తున్నారు. మహిళా స్వశక్తి, వీవో సంఘాల సభ్యులు సెర్ప్‌లో విలీనం కావడంతో ఒకే గొడుగు కింద మహిళా స్వశక్తి సంఘాలు పని చేస్తాయి.

15 సంవత్సరాలకే..

రాష్ట్ర ప్రభుత్వం యువతులకు 18 సంవత్సరాలు నిండిన వారికే స్వశక్తి సంఘంలో సభ్యులుగా నియామకం చేసే అవకాశం ఉండేది. దానిని తొలగిస్తూ 15 సంవత్సరాలకే సంఘ సభ్యులుగా నియమించుకునే అవకాశాన్ని మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. ఇప్పుడు 60 నుంచి దానిని 65 సంవత్సరాలు పెంచడంతో మహిళలకు ప్రభుత్వం కానుక. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు హామీలో భాగంగా మహిళను కోటీశ్వరులు చేయాలని సంకల్పంతో మంత్రివర్గం నిర్ణయం చేయడంతో మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

డీఆర్‌డీవో పర్యవేక్షణలో..

మెప్మా ఉద్యోగులు 217 మంది రిసోర్స్‌పర్సన్లు(ఆర్‌పీ) ఉన్నారు. పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథని, గోదావరిఖని అర్బన్ ఏరియాల్లో పని చేస్తున్నారు. మున్సిపల్ కమిషనర్ల ఆధ్వర్యంలో మహిళా స్వశక్తి సంఘాలకు రుణాలిప్పించడమే కాకుండా చిరు వ్యాపారులకు బ్యాంకు లింకేజీ, శ్రీనిధి రుణాలను అందిస్తారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాల కోసం సర్వేలను చేయడం వీరి విధి. మెప్మా అధికారుల విలీనం కానుండడంతో గ్రామీణ అభివృద్ధి అధికారి పర్యవేక్షణలో విధులు నిర్వహించాల్సి ఉంటుంది. కార్యాలయాలు సైతం రెండు ఒకటే వద్ద ఉండనున్నట్లు ఓ జిల్లా అధికారి చెప్పారు. జిల్లాలో 15 మండల సమైక్యలు ఉండగా, 450 గ్రామ సమైక్య సంఘాలు, 10,953 ఎస్‌హెచ్‌జీలు ఉన్నాయి.



సుల్తానాబాద్‌లోని మహిళా సంఘం భవనంలో వీవోల సంఘం సమావేశం

జిల్లాలో..
మండల గ్రామైక్య: 15
గ్రామైక్య సంఘాలు: 450
ఎస్‌హెచ్‌జీలు: 10,953
సంఘ సభ్యులు: 1,12,845

సీఏలే కీలకం

గ్రామాల్లో మహిళా స్వశక్తి సంఘాలకు సీఏలు, వీవోలు కీలకంగా వ్యవహరించనున్నారు. పట్టణాల్లోకి వస్తే ఆర్పీలు, డీఆర్పీలు వ్యవహరిస్తున్నారు. అందరూ ఒకే గొడుగు కిందికి రావడంతో అభివృద్ధి పనులతోపాటు సంక్షేమ పథకాల సర్వేలు సునాయాసమయ్యే అవకాశాలు అధికంగా ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపిక, ప్రజాపాలన దరఖాస్తులను స్వీకరించడంతోపాటు ఇంటింటా సర్వే కార్యక్రమాలు చేపట్టారు. పలు రకాల సేవలను రాష్ట్ర ప్రభుత్వం వినియోగించుకుంటుంది. రాష్ట్ర ప్రభుత్వం 60 సంవత్సరాల నుంచి 65 సంవత్సరాలు పెంచడం, 18 నుంచి 15 తగ్గించడంతో 20 శాతం మంది యువ మహిళలు మహిళా స్వశక్తి సంఘాల సభ్యులుగా చేరే అవకాశముంది.

పట్టణం	ఎస్‌హెచ్‌జీలు	సంఘ సభ్యులు
పెద్దపల్లి	807	7,716
సుల్తానాబాద్	522	5,145
మంథని	347	3,392
గోదావరిఖని	2,922	29,575

ప్రభుత్వ నిర్ణయం మంచిదే..



గ్రామాలు, పట్టణాలకు చెందిన మహిళా స్వశక్తి సంఘాల విలీనం మంచి నిర్ణయమే. ప్రభుత్వం మహిళలను కోటీశ్వరులు చేయాలనే సంకల్పంతో అందరు ఒక దగ్గర ఉంటే నిర్ణయాలు సులువవుతాయని ముందుకు సాగుతోంది.

– స్వాతి, మహిళా స్వశక్తి సంఘ సభ్యురాలు, సుల్తానాబాద్

ఆదేశాలు రాగానే అమలు చేస్తాం

రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే ఐకేపీలో మెప్మాను విలీనం చేస్తాం. మంత్రివర్గం తీర్మానం చేసి ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. ఉత్తర్వులు రాగానే రెండిటిని విలీనం చేసి ఒకే చాంబర్లో పని చేసేలా చేస్తాం.

– అరుణశ్రీ, అదనపు కలెక్టర్, స్థానిక సంస్థలు

ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోవాలి

ఓదెల: గ్రామీణ ప్రాంతం కూలీలు ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని డీఆర్డీఏ పీడీ కలిందిని అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో 2023–24లో 634 పనులకు అయిన ఖర్చులు రూ.3.17కోట్ల వ్యయంపై ప్రజావేదికలో పర్యవేక్షణ చేశారు. రికవరీ రూ.2,800ను గుర్తించారు. ఉపాధి పనుల విషయంలో అన్ని శాఖలతో ఎల్‌వోసీ తీసుకొని పనులను చేయాలని సూచించారు. ఎంపీడీవో తిరుపతి, ఎంపీవో షబ్బీర్, జిల్లా విజిలెన్స్ అధికారి కొంరయ్య, ఎస్ఆర్‌పీ దేవేందర్, ఏపీవో రమేశ్, సిబ్బంది పాల్గొన్నారు.



పాల్గొన్న డీఆర్డీఏ పీడీ కలిందిని

సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలి

పాలకుర్తి: సైబర్ నేరాల పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని, వ్యక్తిగత, బ్యాంక్ ఖాతాల వివరాలను ఎవరితో పంచుకోవద్దని పెద్దపల్లి సీఐ ప్రవీణ్ కుమార్ అన్నారు. సోమవారం పుట్నూర్ గ్రామ శివారులో గల కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి విద్యార్థులకు సైబర్ నేరాలు, షీటీమ్స్, 100 డయల్ ప్రాముఖ్యం తదితర అంశాల గురించి వివరించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎండపల్లి మండలం ముంజంపల్లి గ్రామంలో గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేసి సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. బసంత్‌నగర్ ఎస్సై స్వామి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం


గోదావరిఖని: షాదీఖానాకు రాష్ట్ర ప్రభుత్వం రూ.2కోట్లు మంజూరు చేయడాన్ని హర్షిస్తూ సోమవారం స్థానిక ప్రధాన చౌరస్తాలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు, రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. కాంగ్రెస్ మైనార్టీ విభాగం అధ్యక్షుడు ఎండీ ఆసిఫ్ పాషా, మాజీ కార్పొరేటర్ ఎండీ ముస్తఫా మాట్లాడారు.

సుల్తానాబాద్: పట్టణంలోని గాంధీనగర్‌లో గాంధీనగర్ విగ్రహం వద్ద సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌గౌడ్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు, జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు అంతటి అన్నయ్యగౌడ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. 20 సంవత్సరాలుగా గాంధీనగర్‌లో సర్వే నంబర్ 909అ, 901/1, 902/2 సర్వే నంబర్లు రిజిస్ట్రేషన్ కాకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నామన్నారు. ఎమ్మెల్యే విజయరమణారావు సిఫారసుతో రిజిస్ట్రేషన్ అయ్యేలా సహకరించారని తెలిపారు.

పెద్దపల్లిలో స్వాగతం

పెద్దపల్లిరూరల్: రైతన్నల కష్టాలను వివరించేందుకు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు చందర్ చేపట్టిన పాదయాత్ర సోమవారం పెద్దపల్లి శివారు బందంపల్లికి చేరుకోగా.. పట్టణ అధ్యక్షుడు ఉప్పు రాజ్‌కుమార్ తదితరులు స్వాగతం పలికారు.

పాలకుర్తి: గోదావరిఖని నుంచి ఎర్రవల్లికి పాదయాత్రగా బయలుదేరిన బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ బృందానికి సోమవారం బసంత్‌నగర్ బస్టాండ్, కన్నాల టోల్‌గేట్ వద్ద స్థానిక బీఆర్ఎస్ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. జీడీనగర్ మాజీ ఎంపీటీసీ బండారి శ్రీవాణి, ముల్కల కొంరయ్య, సర్వర్‌పాషా, ముత్యం సంతోష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



పెద్దపల్లిరూరల్: పాదయాత్రలో చందర్, పెద్దపల్లి బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు తదితరులు

మల్లుస్వరాజ్యం కాలనీ సమస్యలు పరిష్కరించండి

కోల్‌సిటీ: గోదావరిఖని గంగానగర్ సమీపంలోని మల్లుస్వరాజ్యం కాలనీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయం ముందు నినాదాలు చేసిన అనంతరం నగర కమిషనర్(ఎఫ్ఏసీ) జె.అరుణశ్రీకి వినతిపత్రాన్ని అందజేశారు. జిల్లా కార్యదర్శి వై.యాకయ్య మాట్లాడారు. సీపీఎం పట్టణ కమిటీ కార్యదర్శి మహేశ్వరి, నాయకులు సారయ్య, సృజన, కృష్ణకుమారి, సులోచన, పద్మ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



జూలపల్లి: తెలుకుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు పరుగు పందెం పోటీల్లో రాణించి రాష్ట్రస్థాయిలో ఆడేందుకు ఎంపికయ్యారు. జిల్లాస్థాయి పోటీలను సుల్తానాబాద్‌లో నిర్వహించగా.. 100 మీటర్లు, 400 మీటర్ల పరుగు పందెంలో జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు సాన్విశ్రీ ఏడోతరగతి, జి.మణిక్రాంత్ 9వతరగతి రాణించి ఎంపికయ్యారు.

విద్యార్థులకు అభినందన



అభినందిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

ఎలిగేడు/సుల్తానాబాద్: ఈనెల 16న మల్కాజ్‌గిరి, మేడ్చల్‌లలో జి.సాయికుమార్ చీఫ్ ఆర్గనైజర్ ఆధ్వర్యంలో జరిగిన జాతీయస్థాయి కరాటే, కుంగ్‌ఫూ పోటీల్లో సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు మేఘన, పుష్ప, మీనాక్షి, చరిష్మా, అభినయ్, ఇండియన్ పబ్లిక్ స్కూల్ నుంచి జి.హర్షవర్ధన్‌తోపాటు పలువురు బాలబాలికలు బంగారు పతకాలు సాధించారు. ఎలిగేడు మండలం శివపల్లిలో పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు విద్యార్థులను అభినందించి సత్కరించారు.

గ్రూపు–2లో సత్తా చాటిన మంథని యువకుడు



అన్వేశ్‌రెడ్డి

మంథని: మంథనికి చెందిన పెండ్రి అన్వేశ్‌రెడ్డి గ్రూప్–2లో రాష్ట్రవ్యాప్తంగా 153వ ర్యాంకు సాధించాడు. మంథనిలోని పెంజేరుకట్టలో నివాముండే పెండ్రి ప్రభాకర్‌రెడ్డి–సుజాత కుమారుడు అన్వేశ్‌రెడ్డి ఇంతకుముందు సివిల్స్‌లో ప్రిలిమ్స్‌లో రెండుసార్లు అర్హత పొంది మెయిన్స్‌లో సాధించలేకపోయాడు. అన్వేశ్‌రెడ్డి పదోతరగతి వరకు మంథనిలోని మేరీ మీడియా పాఠశాలలో విద్యనభ్యసించి ఇంటర్ హైదరాబాద్‌లోని నారాయణ కళాశాలలో పూర్తి చేశాడు. తమిళనాడులోని వెల్లూరు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఇంజనీరింగ్ విద్యనభ్యసించి గ్రూప్–2 పరీక్షలో రాష్ట్రవ్యాప్తంగా 153వ ర్యాంకు సాధించాడు.

ఆలయంలో శివ కల్యాణం



రాగినేడులో..

పెద్దపల్లిరూరల్: రాగినేడు గ్రామంలో వేములవాడ అనుబంధ దత్తత ఆలయం స్వయంభు నాగలింగేశ్వర ఆలయంలో సోమవారం వేములవాడ ప్రధాన అర్చకుడు రాజేశ్వరశర్మ సూచనల మేరకు శివ కల్యాణం నిర్వహించారు.

ధర్మారం: మండల కేంద్రంలోని శ్రీశివభక్త మార్కండేయస్వామి ఆలయంలో సోమవారం శివపార్వతుల కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ వోడ్నాల శంకరయ్య, సభ్యులు పద్మశాలీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

జూలపల్లి: తెలుకుంటలో పద్మశాలీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సంకటహర చతుర్థిని పురస్కరించుకొని భక్త మార్కండేయస్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించారు.



భలే భలే.. సొరకాయ..

ముత్తారం: కేశనపల్లికి చెందిన గడ్డం మధూకర్ ఇంట్లో సొరకాయ భలే పొడవు పెరిగింది. మూడు నెలల్లోనే సుమారు మూడున్నర ఫీట్లు ఎదిగింది. ఈ సొరకాయను విత్తనానికి ఉంచుతున్నట్లు మధూకర్ తెలిపారు.

సింగరేణి వార్తలు

ఐఎన్‌టీయూసీలో చేరిన ఆర్జీ–2 ఉద్యోగులు

గోదావరిఖని: ఆర్జీ–2 ఏరియాకు చెందిన పలువురు ఉద్యోగులు సోమవారం ఐఎన్‌టీయూసీలో చేరారు. ఆర్జీ–2 ఉపాధ్యక్షుడు శంకర్‌నాయక్ ఆధ్వర్యంలో పలువురు యూనియన్‌లో చేరగా.. యూనియన్ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్ కండువాలు కప్పి యూనియన్‌లోకి ఆహ్వానించారు.

విధుల్లో ప్రతిభ కనబర్చాలి

గోదావరిఖని: యువ ఉద్యోగులు వృత్తిలో పూర్తిస్థాయిలో రాణిస్తూ రక్షణతో కూడిన నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి చేయాలని ఆర్జీ–2 జీఎం బండి వెంకటయ్య అన్నారు. సోమవారం ఏరియాలోని వకీల్‌పల్లి గనిలో ఓవర్‌హాల్ చేసుకొని గనిలోకి వెళ్తున్న కంటిన్యూస్ మైనర్‌కు పూజలు నిర్వహించి ప్రారంభించారు. పూర్తిస్థాయి మరమ్మతుతో మూడేళ్ల వరకు ఎలాంటి ఇబ్బంది లేకుండా బొగ్గు ఉత్పత్తి చేస్తుందన్నారు. యూనియన్ నాయకులు జిగురు రవీందర్, ప్రాజెక్ట్ అధికారి నెహ్రూ, ఏరియా ఇంజినీర్ నరసింహారావ్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక చైతన్య యాత్ర స్ఫూర్తితోనే లక్ష్యాల సాధన

గోదావరిఖని: సంస్థ సీఅండ్ఎండీ ఎన్.బలరాం ఇచ్చిన కార్మిక చైతన్య యాత్ర స్ఫూర్తితోనే జీడీకే–5 ఓసీపీ ఉద్యోగులు వార్షిక లక్ష్యాలను 16 రోజుల ముందుగానే సాధించినట్లు ఆర్జీ–1 జీఎం లలిత్‌కుమార్ అన్నారు. సోమవారం జీడీకే–5 ఓసీపీ ఆవరణలో ఏర్పాటు చేసిన అభినందన సభలో కార్మికులనుద్దేశించి ప్రసంగించారు. ఉద్యోగులకు స్వీట్లు పంపిణీ చేశారు. ప్రాజెక్ట్ ఆఫీసర్ కె.చంద్రశేఖర్, సేఫ్టీ అధికారి పానుగోటి శ్రీనివాస్, ప్రాజెక్టు ఇంజనీర్ రమేశ్, ఎస్‌వోఎం అనిల్‌గబాలే తదితరులు పాల్గొన్నారు.

సంఘటిత పోరాటాలతోనే సింగరేణి పరిరక్షణ

గోదావరిఖని: సంఘటిత పోరాటాల ద్వారానే సింగరేణి సంస్థ పరిరక్షణ సాధ్యమని ఐఎఫ్‌టీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి టి.శ్రీనివాస్ అన్నారు. సోమవారం స్థానిక ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జీఎల్‌బీకేఎస్, టీజీఎల్‌బీకేఎస్ విలీన సభలో మాట్లాడారు. గోదావరిలోయ బొగ్గు గని కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఐ.కృష్ణ, సీతారామయ్య, రాష్ట్ర నాయకులు నరేశ్, బి.అశోక్, ఇ.రామకృష్ణ, ఎండీ జాఫర్, గోని నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానం మహాదానం

యైటింక్లయిన్‌కాలనీ: నేత్ర, శరీర అవయవ దానాలు చేయడం ఎంతో గొప్ప కార్యమని సదాశయ ఫౌండేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి లింగమూర్తి అన్నారు. సోమవారం ఆర్జీ–2 ఏరియా ఎంవీటీసీ శిక్షణ కేంద్రంలో నేత్ర, శరీర అవయవ దానాలపై అవగాహన కల్పించారు. శిక్షణ తీసుకుంటున్న 50 మంది యువ సింగరేణి కార్మికులు, ఉద్యోగులు నేత్ర, శరీర అవయవ దానాలకు ముందుకు రాగా.. వారికి శిక్షణ కేంద్రం మేనేజర్ మురళీకృష్ణ డోనర్ కార్డులను అందజేశారు.



కమాన్‌పూర్: విద్యార్థుల నృత్యం



ఓదెలలో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

కమాన్‌పూర్: మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ పాఠశాలలో సోమవారం వార్షిక వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ముఖ్య అతిథులుగా వచ్చిన తహసీల్దార్ వాసంతి, ఎంపీడీవో లలిత మాట్లాడుతూ.. విద్యార్థులు మంచి మార్కులు సాధించి ఉన్నతస్థాయిలో నిలవాలన్నారు.

ఓదెల: ఓదెల, కనగర్తి హైస్కూల్లో పదోతరగతి విద్యార్థులకు సోమవారం ఘనంగా వీడ్కోలు పలికారు. ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలతో జూనియర్ విద్యార్థులు పదోతరగతి విద్యార్థులను సాగనంపారు. ఎంఈవో ఎర్ర రమేశ్, ప్రధానోపాధ్యాయురాడు లక్ష్మినారాయణ పాల్గొన్నారు.

కనగర్తి గ్రామంలోని పద్మహన్మయ్య హైస్కూల్లో పదోతరగతిలో ఎంతమంది టాప్‌గా నిలుస్తారో వారికి రూ.లక్ష బహుమానం చొప్పున ఇస్తామని దాసరి పద్మ, హన్మయ్య ఫౌండేషన్ వ్యవస్థాపకులు పేర్కొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

ఎలిగేడు: ఈనెల 21 నుంచి జరిగే పదోతరగతి పరీక్షల్లో విద్యార్థులు వంద శాతం ఉత్తమ ఫలితాలు సాధించి గుర్తింపు తీసుకురావాలని అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ రేఖ, హెచ్ఎం గంధ్ర దేవేందర్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం జరిగింది. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

జూలపల్లి: మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల 21 నుంచి ఏప్రిల్ 4 వరకు నిర్వహించనున్న పదోతరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. మండల కేంద్రంతోపాటు గ్రామాల్లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, ఆదర్శ విద్యాలయం, కస్తూర్బా బాలికల విద్యాలయం, మూడు ప్రైవేటు పాఠశాలలకు చెందిన 243 మంది పరీక్షలు రాసేందుకు కళాశాలలో సౌకర్యాలు కల్పించారు.

జోరుగా మాస్ కాపీయింగ్

సుల్తానాబాద్: జిల్లాలో ఇంటర్ పరీక్షల సెల్ఫ్ సెంటర్లలో జోరుగా మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతున్నారు. ప్రభుత్వ లెక్చరర్లు విద్యార్థులను ప్రోత్సహిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఈనెల 5 నుంచి పరీక్షలు ప్రారంభమయ్యాయి.

జిల్లాలో 6 సెల్ఫ్ సెంటర్లలో మాస్ కాపీయింగ్ జరుగుతున్నట్లు బహిరంగంగానే అధ్యాపకులు, విద్యార్థులు చెబుతున్నారు. కమాన్‌పూర్, ముత్తారం, కాల్వశ్రీరాంపూర్, జూలపల్లి, ఓదెల, సుల్తానాబాద్‌లో ఈ తతంగం జరుగుతోందని ఉన్నతాధికారులకు ఫిర్యాదులందాయి. వెంటనే ఉన్నతాధికారులు ప్రత్యేక బృందాలను శనివారం కాల్వశ్రీరాంపూర్ మండల కేంద్రంలోని గుట్టపై ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల సెంటర్‌కు వెళ్లి మాస్ కాపీయింగ్ పాల్పడుతున్న విద్యార్థిని డిబార్ చేశారు. జిల్లాలోనే మొదటిదిగా నమోదయింది. నూతన కమిషనర్ బాధ్యతలు చేపట్టిన అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో అనేక మార్పులను తీసుకొచ్చారు. విద్యార్థులు, అధ్యాపకుల హాజరు శాతం, నిబంధనల ప్రకారం పాఠ్యాంశాలు పూర్తి చేసి పరీక్షలు నిర్వహించడం, వెనకబడిన విద్యార్థులను గుర్తించి చదువులో ముందుండేలా తరగతులు నిర్వహించడం, మార్కులు సాధించేలా చైతన్యవంతం చేస్తున్నారు. కమిషనర్ రాకతో రిజల్ట్ రాకుంటే తమపై వేటు తప్పదనే భావనతో విద్యార్థులు పాసయ్యేలా సెల్ఫ్ సెంటర్లలో మాస్ కాపీయింగ్ పాల్పడేలా ప్రభుత్వ అధ్యాపకులు వ్యవహరిస్తున్నారని ఆరోపణలున్నాయి. ఇంటర్మీడియట్ నోడల్ ఆఫీసర్ కల్పనను వివరణ కోరగా.. మాస్ కాపీయింగ్ కాల్వశ్రీరాంపూర్‌లో జరుగుతున్నట్లు దృష్టికి రావడంతో వెంటనే అధికారుల బృందాన్ని పంపించి చర్యలు తీసుకున్నామన్నారు. మాస్ కాపీయింగ్‌ను ప్రోత్సహిస్తే అధ్యాపకులపై వేటు వేస్తామని పేర్కొన్నారు.

బట్టీల్లో వసతులేవి..

పెద్దపల్లిరూరల్: రంగాపూర్ గ్రామ శివారులోని ఇటుకబట్టీల్లో పని చేసే కార్మికులు, వారి పిల్లలకు కనీస వసతులను కల్పించడంలో బట్టీ యజమానులు విఫలమయ్యారని సీపీఎం నాయకులు ఆరోపించారు. ఇటుకబట్టీలను సోమవారం అశోక్ తదితర నాయకులు సందర్శించి పరిస్థితులపై ఆరా తీశారు.